## జనార్దన్‌రెడ్డిని కలిసిన కొండా

మద్దతు ఇవ్వాలని కోరిన విశ్వేశ్వర్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: బీజేపీ సీనియర్ నేత బి.జనార్దన్ రెడ్డితో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన జనార్దన్‌రెడ్డి కొన్నాళ్లుగా ఆరోగ్య రీత్యా విరామం తీసుకుంటున్నారు. ఆయన సేవలను పార్టీకి వినియోగించుకోవాలని భావించిన కొండా లోకసభ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. దీనికి జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కొండా వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నేతలు నవీన్ రెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.


## భారీ వర్షంతో నిలిచిన విద్యుత్ సరఫరా

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో ఈదురుగాలులు, వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కాలనీల్లో చీకట్లు అలుముకున్నాయి. తారానగర్ మార్కెట్, లింగంపల్లి, ఆదర్శనగర్, గోపీనగర్, ప్రశాంత్‌నగర్, వేంకటేశ్వరకాలనీల్లో సరఫరా నిలిచిపోయింది. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ లేక కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు. నల్లగండ్ల సబ్‌స్టేషన్ ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి మాట్లాడుతూ.. విరిగిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని, విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## కళా సిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభం

మోతీనగర్: మోతీనగర్ క్రాస్ రోడ్డులో కళా సిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఏడు రోజుల మాత్రమే ఉంటుందని నిర్వాహకులు వినోద్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో భారతదేశంలో ఎంపికైన చేనేత కళాకారులచే అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# ఉన్నత చదువులకు ఊతం 'నిథమ్'



**పర్యాటక, ఆతిథ్యరంగాల్లో దేశంలోనే ప్రత్యేక స్థానం ● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉపాధి కల్పనకు పెద్దపీట**




రాయదుర్గం: జాతీయ స్థాయిలో పర్యాటక, అతిథ్య రంగాల్లో ఉన్నత చదువులు, శిక్షణలు, స్వల్పకాలిక, రెగ్యులర్ కోర్సులకు గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) పేరు గాంచింది. జాతీయ, అంతర్జాతీయంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక, ఆతిథ్య రంగాల్లో అనేక కోర్సులు నిర్వహిస్తోంది. ఉన్నత విద్యలో రెగ్యులర్ కోర్సులు, స్వల్పకాలిక కోర్సులు, పలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. చదువుకున్న, శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధి కల్పిస్తూ.. 100 శాతం ఉపాధి కల్పించే జాతీయస్థాయి సంస్థగా రూపొందింది 'నిథమ్'. ప్రస్తుతం ఆరంభమైన ప్రవేశాల ప్రక్రియ జూన్ వరకు కోర్సులలో చేరడానికి అవకాశం ఉంటుంది.

### దేశంలో తొలిసారిగా పర్యాటక, ఉన్నత విద్యాసంస్థ ఏర్పాటు..

- భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా పర్యాటక, ఆతిథ్య రంగాల్లో ఉన్నత విద్య, శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తలపెట్టారు.
- దీనిలో భాగంగా 2004లో అక్టోబర్ 18న ఈ 'నిథమ్'ను ఏర్పాటు చేశారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేతుల మీదుగా ఈ సంస్థను ప్రారంభించారు.
- గత 20 ఏళ్లుగా 30 ఎకరాల విశాల స్థలంలో ఈ 'నిథమ్' గచ్చిబౌలిలోని టెలికామ్‌నగర్‌లో కొనసాగుతోంది.
- ఈ విద్య, శిక్షణా సంస్థలో అత్యుత్తమ బోధనాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పరిశోధనాత్మక కేంద్రం, విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన వసతి గృహాలు, ఔట్‌డోర్, ఇండోర్ క్రీడా సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్, ప్రత్యేక పరిపాలనా భవనం, ఆతిథ్య భవనం ఏర్పాటు చేశారు.

### చెరువు, రాతి, మట్టితో కూడిన గుట్టను కాపాడుతూ..

- నిథమ్ ప్రాంగణంలో దశాబ్దాల చరిత్ర కలిగిన రామమ్మకుంట చెరువును ఇప్పటికీ మూడున్నర ఎకరాల స్థలంలో కొనసాగిస్తూ.. వస్తున్నారు. దీన్ని గత రెండేళ్ల క్రితం పూడికతీసి, మరో అర ఎకరం విస్తరించేలా కూడా చేశారు.




ఓనమ్ వేడుకల్లో విద్యార్థులు (ఫైల్)

- ఆధునిక తరహాలో చుట్టూరా సౌకర్యాలు కలిపించి భవిష్యత్తులో బోటింగ్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.
- రెండుచోట్ల ఫౌంటేన్లను కూడా తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. రాతి, మట్టితో కూడిన గుట్టను కూడా కాపాడుతూ.. దీన్ని శిల్పాల పార్కుగా రూపొందించి, దాని ముందే అంఫీథియేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీనికితోడు రెస్టారెంట్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.
- అనంతరం సొంత నిధులతో క్రికెట్ పిచ్‌ను తయారు చేసి ఆడుకోవడానికి అవకాశం కల్పించారు.
- అత్యాధునిక సౌకర్యాలతో తరగతి గదులు, ఆధునిక తరహాలో లైబ్రరీ, పూర్తిస్థాయి వసతులతో హాస్టల్ సౌకర్యం కల్పించారు.
- భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడుగుంతలు, చెరువు పరిధి విస్తరణ చేయడం, లోతు పెంచడం వంటి చర్యలతోపాటు గ్రీనరీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడంతో రూపురేఖలే మారిపోయాయి. పండ్లు, పూలు, ఇతర గ్రీనరీని పెంచే చెట్లను పెంచుతూ.. ఆకర్షణీయంగా క్యాంపస్‌ను తీర్చిదిద్దారు.

### నిథమ్‌లో అందించే కోర్సులివే..

పర్యాటక ఆతిథ్య రంగాల్లో రెగ్యులర్ కోర్సులను నిర్వహిస్తున్నారు. సాధారణ విద్యార్థులను ఆలిండియా ఎంట్రెన్స్ టెస్ట్ మ్యాట్, ఐసెట్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. అర్హతలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిథమ్ అధికార యంత్రాంగం కోరుతోంది.

1. కోర్సు ఎంబీఏ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ-రెండేళ్ళ కాలపరిమితి- గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు ఉండాలి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 45 శాతంతో ఉత్తీర్ణులు కావాలి- క్యాట్/ మ్యాట్/ఏటీఎంఏ/ఐసెట్‌లో అర్హత సాధించాలి. గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
2. బీబీఏ- టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ నాలుగేళ్ల కాలపరిమితి- ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులుండాలి, ఎస్సీ,ఎస్టీలకు 45 శాతం ఉండాలి, యూజీఏటీ/జేఈఈ-ఎన్‌సీహెచ్‌ఎంసీటీ/ ఏటీఎంఏ- యూజీ/ఎంసెట్/టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ ఈక్వలెంట్ లేదా ఏడబ్ల్యూటీ టెస్ట్ నిథమ్ నిర్వహించిన దానిలో అర్హత ఉండాలి. ఆ తర్వాత వ్యక్తిగత ఇంటర్వ్యూలో పాల్గొనాలి.
3. బీఎస్సీ-హస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్-మూడేళ్ల కాలపరిమితి- ఇంటర్మీడియట్‌లో పాసై ఉండాలి, ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా ఉండాలి. జేఈఈ-ఎన్‌సీహెచ్‌ఎంసీటీ అర్హత సాధించాలి. కౌన్సెలింగ్ ఎన్‌సీహెచ్‌ఎంసీటీ ద్వారా పొందాల్సి ఉంటుంది.



కిచెన్‌లో విద్యార్థినులకు ప్రాక్టికల్స్ శిక్షణ ఇస్తున్న దృశ్యం

## నూతన కమిటీ నియామకం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని 'చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్' ఆఫీస్ బేరర్ల సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, అధ్యక్షులు డాక్టర్ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం, మహిళా సంక్షేమ కేంద్రం, నీలం రాజశేఖర్‌రెడ్డి పరిశోధనా కేంద్రం, ఆరోగ్య కేంద్రాల కార్యకలాపాలపై సమీక్షించారు. సీఆర్ ఫౌండేషన్ సామాజిక సేవ కార్యక్రమాలను కొనసాగించేందుకు వీలుగా హైదరాబాద్ కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ భూమి లీజును మరో 25 ఏళ్ల పొడిగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధనా కేంద్రం కార్యకలాపాల నిర్వహణకు నూతన కమిటీని నియమించారు. డైరెక్టర్‌గా జార్జియాలోని ఇండియా టు అమెరికా మాజీ అంబాసిడర్ డాక్టర్ టి.సురేష్‌బాబు, కన్వీనర్‌గా కె.అజయ్‌కుమార్, సభ్యులుగా డాక్టర్ బీ.వీ విజయలక్ష్మి, ప్రొఫెసర్ జీవీ. రత్నాకర్, బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి, కనపర్తి జ్యోత్స్న, దేవేంద్రరావు, ఎన్. కొండయ్య, దత్తాత్రేయశర్మ, వల్లూరిపల్లి రమేష్‌చంద్ర, జవహర్, కల్పన, నళినిలను నియమించారు. సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి చెన్నకేశవరావు తదితరులున్నారు.

## ఎన్నికల నిబంధనలు పాటించండి

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలను ముమ్మరం చేశాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట రహదారిపై మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వార్-2 అధికారి హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకే నగదు తీసుకువెళ్లాలని, రూ.50 వేలు మించి నగదు తీసుకెళ్తే నగదును సీజ్ చేస్తామని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వార్ అసిస్టెంట్ అధికారి సుభాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరికీ ప్రాధాన్యమిస్తాం

జిన్నారం: కాంగ్రెస్‌లో చేరిన ప్రతిఒక్కరికీ తగిన ప్రాధాన్యత ఇస్తామని మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. మండల పరిధిలోని కిష్టాయిపల్లి గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకుడు సందేగారి ఇంద్రసేన మంగళవారం 50 మంది యువకులతో నీలం మధు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఎంపీగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇచ్చేందుకు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ గెలిచేలా ప్రజలు తీర్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ఇంద్రసేనాతో పాటు పలువురు యువకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జనాభాయి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

రాజేంద్రనగర్: మంగళవారం సాయంత్రం కురిసిన గాలివానకు విద్యుత్ సరఫరాలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించామని రాజేంద్రనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎల్.గోపయ్య తెలిపారు. కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాజేంద్రనగర్, కందుకూర్, షాద్‌నగర్ డివిజన్ పరిధిలో గాలివానకు వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు పడిపోవడం, విద్యుత్ వైర్లలో స్పార్క్ రావడంతో అక్కడక్కడ విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో వర్షంలో సైతం తమ సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి మరమ్మతులు చేపట్టారని పేర్కొన్నారు. రాత్రి 8 గంటల వరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు.

## ఈ నెల 10న అక్షయ తృతీయ పూజలు

మణికొండ: ఈ నెల 10వ తేదీన అక్షయ తృతీయను పురస్కరించుకుని అలకాపూర్ టౌన్‌షిప్‌లోని తుల్జారాంబాగ్ ఆలయాల ఆవరణలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అరుణాచల శివసేవా సత్సంగం నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవీ హోమం, శివుడికి రుద్రాభిషేకం, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు గోపూజ, లక్ష్మీకుబేర పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే పేదలు, బ్రాహ్మణులకు పెరుగు అన్నం, చాప, చెప్పుల జత, పండ్లు, కూరగాయలు, మజ్జిగ, విసనకర్ర, మట్టికుండ, గొడుగు, స్వయంపాకంలకు 150 బ్రాహ్మణులు, 150 మంది గోశాల సేవకులకు కిట్ రూపంలో అందించనున్నట్లు తెలిపారు. కిట్లను దానం చేయాలనుకునే వారు రూ.1916 లు తమకు చెల్లిస్తే వారి గోత్రనామాలతో దానం చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96521 10433, 99856 15805 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఆలస్యంగా ఎంసెట్ ప్రారంభం

మణికొండ: ఆన్‌లైన్‌లో మంగళవారం నిర్వహించిన ఎంసెట్ పరీక్ష అరగంట ఆలస్యం కావడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష రాసేందుకు 430 మంది విద్యార్థులు వచ్చారు. ఉదయం 9 గంటలకే ప్రారంభం కావాల్సిన పరీక్ష 9:30 వరకు కూడా మొదలు కాకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే నిర్వాహకులు బయోమెట్రిక్ కీస్‌లలో వచ్చిన సమస్యను గుర్తించి సరి చేయడంతో పరీక్ష మొదలయ్యింది. ఆన్‌లైన్‌లో లాగిన్ అయిన తర్వాత పరీక్ష రాసేందుకు 3 గంటల సమయం ఉంటుందని వారు తెలిపారు. పరీక్ష నిర్వాహకుల బయోమెట్రిక్ సమస్యతో ఆలస్యం అయ్యిందని ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

## 'శ్రీదేవి'లో ముగిసిన సాంకేతిక ఉత్సవం



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి శివారులోని శ్రీదేవి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా కొనసాగిన అభ్యుదయ-24(సాంకేతిక ఉత్సవం) మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద మాట్లాడుతూ సాంకేతిక నిపుణులతో కమ్యూనికేషన్, నిర్వహణ నైపుణ్యాలను పెంపొందించటమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సరికొత్త ట్రెండ్, కొత్త అవకాశాల గురించి విద్యార్థులకు అవగాహన వస్తుందన్నారు. సాంకేతిక ఉత్సవంలో 4 టెక్నికల్ ఈవెంట్‌లు, స్కాన్ వెంచర్‌లు, మైండ్ మ్యాట్రిక్స్, 4నాన్ టెక్నికల్ ఈవెంట్‌లు, ఎడిటోపియా, విజన్ ఫ్యూజన్, జీపర్స్ కీపర్‌లతో పాటు అనేక ఆకర్షణీయమైన ఈవెంట్లు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అకాడమిక్స్ డీన్ డాక్టర్ కె. శివనాగిరెడ్డి, ఆర్డీ డీన్ డాక్టర్ ఎస్. జగదీష్, కన్వీనర్, ఐటీ హెచ్‌ఓడీ డాక్టర్ బి.నరేంద్రకుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారీగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్





గచ్చిబౌలి: శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. మంగళవారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులు బారులు తీరారు. బుధవారంతో గడువు ముగియనుండటంతో భారీసంఖ్యలో తరలి వచ్చారు. నియోజకవర్గ పరిధిలో 2847 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 818 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు.

**ఓటు వేసిన ఏఆర్ఓ స్నేహ శబరిష్..**

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఏఆర్ఓ, వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్ ఆమె ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. మంగళవారం ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పికెట్ కేంద్రీయ విద్యాలయంలో ఓటు వేశారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

## అవినీతి మచ్చలేని కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి



వెంకటేశ్వరనగర్ ప్రచారంలో రవికుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా వివేకానందనగర్ డివిజన్‌లో మంగళవారం శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ ప్రచారం నిర్వహించారు. వెంకటేశ్వరనగర్‌లో ఇంటింటికీ వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అటు నరేంద్ర మోదీ, ఇటు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకులని... అలాంటి వారే నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి రెండు లక్షల ఓట్ల భారీ మెజారిటీతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకుపోతున్న నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, డివిజన్ అధ్యక్షులు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు అడుగు జాడల్లో నడవాలి



సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి పోరాడి ప్రాణాలర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతిని మంగళవారం ఉషా ముళ్లపూడి కమాన్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైదర్ నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన మహానీయుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. మన్యం ప్రజల్లో విప్లవ బీజాలు నాటి ప్రజలను చైతన్యపరిచి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా చైతన్యపరిచిన మహానుభావుడు అల్లూరి అని ఎమ్మెల్యే గాంధీ కొనియాడారు. 22 ఏళ్ల చిన్న వయసులోనే మన్యం ప్రజలను కలుపుకుని బ్రిటీష పాలనను ఎదిరించిన గొప్ప యోధుడని, సాయుధ పోరాటం ద్వారా మాత్రమే భారతదేశానికి బ్రిటీష్ వారి నుంచి విముక్తి లభిస్తుందని నమ్మిన యోధుడని కొనియాడారు. ఎంతోమందికి అల్లూరి జీవితం గొప్పస్ఫూర్తి అన్నారు.ఆయన అడుగు జాడల్లో యువత నడవాలని తెలిపారు. కార్యక్రమంలో సాంబశివరావు, క్షత్రియ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



మార్తాండనగర్‌లో ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ హమీద్ పటేల్

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా డాక్టర్ రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్, హనీఫ్ కాలనీలో రంజిత్‌రెడ్డి కుమారుడు ఆర్యన్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటువేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతో దేశ, రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. స్నేహశీలి, మృదుస్వభావి, సేవగుణం కలిగిన మన రంజిత్‌రెడ్డిని గెలిపిస్తేనే శేరిలింగంపల్లి అభివృద్ధి చెందుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే పార్టీ ధ్యేయమన్నారు. డాక్టర్ రంజిత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతుగా నిలవాలన్నారు. ఈనెల 13న హస్తం గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పీసీసీ స్పోక్ పర్సన్ వేణుగోపాల్ రెడ్డి, టి.కృష్ణ, అఖిల్ పటేల్, ఆదిల్ పటేల్, రూపారెడ్డి, జంగంగౌడ్, రమేష్‌గౌడ్, సాజిద్, హనీఫ్, ఆంజనేయులు, యాదగిరి, అబేద్‌అలీ, వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పటాన్‌చెరుకు కేసీఆర్

పటాన్‌చెరు టౌన్: మాజీ సీఎం కేసీఆర్ బుధవారం పటాన్‌చెరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ పార్టీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేయనున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే రోడ్‌షోలో కేసీఆర్ పాల్గొనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం తెలిపారు.

# ముస్లింలకు పెద్దన్న కేసీఆర్

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట వేసిన మహోన్నత వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ముస్లింలను గత 10 ఏళ్ల కాలంలో ఎంతో ప్రాధాన్యమిచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. గంగ జమున తహజీబ్ సంస్కృతికి పెద్దపీట వేయడంతో పాటు మతసామరస్యం పెంపొందించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓటు బ్యాంకుగా మార్చుకుంటోందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు తొలగించి రాజ్యాంగాన్ని సవరించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వ్యక్తిత్వ వికాసా నిపుణులు, ముస్లిం మత ప్రబోధకులు సిరాజ్ ఉర్ రెహమాన్, అల్లమా అహ్మద్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను ఒక్కతాటిపై నిలిపి వారి అభివృద్ధికి కృషి చేస్తున్న గొప్ప నాయకుడు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అని కొనియాడారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, మైనార్టీలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలి**

పటాన్‌చెరు టౌన్: దేశ ఆర్థిక రంగానికి వెన్నుముకగా నిలుస్తున్న కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మెడలు వంచాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వివిధ కార్మిక సంఘాల మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను ఆమోదిస్తూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని ధ్వజమెత్తారు. కార్మికులను రోబోల మాదిరిగా పని చేయిస్తూ కార్మిక హక్కులను కాల రాస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడలు వంచాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఈశ్వర్ ప్రసాద్, నర్ర భిక్షపతి, మాధవరావు పాల్గొన్నారు.










## భారీ వర్షం.. ట్రాఫిక్ జామ్..

నగరంలో కురిసిన భారీ వర్షానికి దేతిశ్రీనగర్‌లో చెట్టు విరిగిపడింది. కొండాపూర్‌లో భారీ వరదతో వాహనదారులు, బాటసారులు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కొండాపూర్ జంక్షన్, మియాపూర్ సహా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు కాలనీలు అందకారంలో ఉన్నాయి. – గచ్చిబౌలి

